సాక్షి చిత్తూరు

ఆదివారం । 19 । జనవరి । 2025



పచ్చదనం పెంచండి

ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా పచ్చదనం పెంచాలని సమగ్రశిక్ష ఏపీసీ వెంకటరమణ పిలుపునిచ్చారు.

- 8లో



చిత్తూరులో భారీ చోరీ

చిత్తూరు నగరంలోని దొడ్డిపల్లెకు చెందిన విశ్రాంత ఉద్యోగి ఇంట్లో శుక్రవారం రాత్రి భారీ చోరీ జరిగింది.

- 8లో



భూ ఆక్రమణలపై ఆందోళన

సాగు భూముల ఆక్రమణలను నిరసిస్తూ యానాదులు పుత్తూరు రెవెన్యూ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు.

- 8లో

న్యూస్‌రీల్

జగన్ మళ్లీ సీఎం కావాలని మొక్కులు



జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలంటూ శబరిమలలో నినాదాలు చేస్తున్న భక్తులు

కుప్పం రూరల్: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కుప్పం మండలం చీగలపల్లి గ్రామానికి చెందిన అయ్యప్ప భక్తులు శబరిమలలో స్వామివారిని వేడుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. 40 రోజుల క్రితం అయ్యప్ప మాల ధరించిన చీగలపల్లి భక్తుల బృందం శనివారం శబరిమల చేరుకుంది. అక్కడ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని అయ్యప్ప స్వామివారిని వేడుకున్నారు. ఆయన సీఎం అయితే గ్రామం నుంచి శబరిమలకు కాలినడకన వస్తామని భక్తులు మొక్కుకున్నారు. స్వామివారిని వేడుకున్న వారిలో రాజ, శేషాద్రి, నాగభూషణం, ప్రసాద్, సంతోష్, రాణా, ప్రతాప్, వారి బృందం సభ్యులు ఉన్నారు.

పకడ్బందీగా స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛదివస్



కలెక్టరేట్‌లో మొక్క నాటి, నీరు పోస్తున్న డీఆర్వో మోహన్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్ : అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రతి మూడో శనివారం స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛదివస్ పకడ్బందీగా నిర్వహించాలని డీఆర్వో మోహన్‌కుమార్ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని పలు కార్యాలయాల్లో స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛదివస్ కార్యక్రమం నిర్వహించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో డీఆర్వో మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలు, పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణ మెరుగ్గా ఉండాలన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయాన్ని పరిశుభ్రంగా పెట్టుకోవడం అధికారుల బాధ్యతన్నారు. అనంతరం కలెక్టరేట్‌లోని పలు శాఖల్లో పారిశుద్ధ్య నిర్వహణను పర్యవేక్షించారు. జ్యోతిరావు పూలే, వివేకానంద భవనం, అంబేడ్కర్ భవనం పరిసరాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టి, మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ కులశేఖర్, పలు శాఖల జిల్లా అధికారులు శ్రీదేవి, రాజ్యలక్ష్మి, రవికుమార్, రబ్బానీబాషా, చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఈ చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి పేరు పుష్పరాజ్. ఈయన పలమనేరు వాసి. ఈయన భూమిలో కొంత భాగం ఇటీవల ఎక్స్‌ప్రెస్ హైవే కోసం సేకరించారు. అది పోను మిగిలిన 20 సెంట్లను నిబంధనలకు వ్యతిరేకంగా పలమనేరు రెవెన్యూ అధికారులు వేరే వారి పేరుతో రాసిచ్చేశారు. ఆ సమస్య పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులో అర్జీ ఇచ్చినా ఇంతవరకు పరిష్కారం కాలేదు.



రెవెన్యూ సదస్సుల్లో అర్జీ స్వీకరిస్తున్న అధికారులు (ఫైల్)

అర్జీ.. ఆవేదన

రెవెన్యూ సదస్సులో అర్జీ ఇచ్చా.. అది ఏమైందో?
పట్టించుకున్నారో లేదో?
పట్టించుకుంటే ఇప్పుడు ఏ దశలో ఉందో?
నా సమస్య పరిష్కారం కాలేదు..
పరిష్కరించినట్లు చెబుతున్నారు..
పునఃపరిశీలించమని అడగొచ్చా?
అడిగితే ఏమనుకుంటారో?..

ఇవీ.. సమస్యల పరిష్కారం కోసం గ్రామ సభల్లో అర్జీలు ఇచ్చిన బాధితులను వేధిస్తున్న ప్రశ్నలు. కూటమి సర్కారు ప్రచార ఆర్భాటం.. చిత్తశుద్ధి, పారదర్శకత, జవాబుదారీతనం లేమి.. అధికారుల అలసత్వం.. ఫలితం అర్జీదారులకు తప్పని తిప్పలు.. మిగిలిన ఆవేదన. ఇదీ నేటి సామాన్య, మధ్యతరగతి వారి దుస్థితి.

నిర్వహణలో ఆర్భాటం.. పరిష్కారంలో అలసత్వం

- రెవెన్యూ సదస్సులు ముగిసినా తీరని బాధలు
- చేతులెత్తేసిన జిల్లా యంత్రాంగం
- కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు
- ప్రజలకు తప్పని తిప్పలు

చిత్తూరు కలెక్టరేట్ : కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత భూ సమస్యల పరిష్కారం పేరుతో రెవెన్యూ సదస్సులు నిర్వహించింది. జిల్లాలోని 822 రెవెన్యూ గ్రామాల్లో అధికారులు సదస్సులు నిర్వహించారు. ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ ఆ తర్వాత వాటిని పరిష్కరించకుండా జిల్లా యంత్రాంగం చేతులెత్తేసింది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

అర్జీలు 10,579.. పరిష్కారం 1,389

జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో 10,579 అర్జీలు నమోదయ్యాయి. ఇందులో ఈ నెల 18వ తేదీ వరకు 1,389 అర్జీలు పరిష్కరించినట్లు అధికారిక నివేదికలు వెల్లడిస్తున్నాయి. పరిష్కరించిన 1,389 అర్జీల్లోనూ వంద శాతం సమస్య పరిష్కారం కాలేదని ప్రజలు వాపోతున్నారు. ఇంకా 9,190 రెవెన్యూ సదస్సుల అర్జీలు పరిష్కరించాల్సి ఉంది. వీటి పరిష్కారం ఇంకెప్పుడవుతోందనన్న అనుమానం తలెత్తుతోంది. కుప్పం, పలమనేరు నియోజకవర్గాల్లో సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించకుండానే, పరిష్కరించినట్లు రెవెన్యూ అధికారులు, అర్జీదారుల నుంచి లిఖిత పూర్వకంగా రాయించుకుంటున్నట్లు ప్రజలు వాపోతున్నారు. రెవెన్యూ సదస్సుల్లో అత్యధికంగా బైరెడ్డిపల్లి మండలంలో 827, అత్యల్పంగా గుడిపాల మండలంలో 108 అర్జీలు నమోదయ్యాయి. ఈ సదస్సుల్లో ఎక్కువగా రెవెన్యూ రికార్డుల హక్కుల కోసం 5,162, భూ సరిహద్దుల తగాదాలు 1,259, రీ సర్వే (ఎస్ఎస్ఎల్ఆర్) సమస్యలు 725, ఏజెన్సీ భూ సమస్యలు 715, ప్రభుత్వ భూమి అసైన్‌మెంట్ సమస్యలు 600, దారి సమస్యలు 460, అసైన్‌మెంట్ ఇళ్ల పట్టాల సమస్యలు 363, రీ సర్వే గ్రీవెన్సెస్ 305, 22ఏ సమస్యలు 258, అసైన్‌మెంట్ భూములు (పీవోటీ) చట్టం 1977 సమస్యలు 224, పట్టా సబ్ డివిజన్ 154, ప్రభుత్వ భూముల ఆక్రమణ 152, ఇతరాలు 202 మొత్తం 10,579 సమస్యలు రెవెన్యూ సదస్సుల్లో నమోదైనట్లు అధికారిక నివేదికలు వెల్లడిస్తున్నాయి. కేవలం పదిశాతం మాత్రమే పరిష్కారం కావడంతో మిగిలిన అర్జీదారులకు తిప్పలు తప్పడం లేదు.

సదస్సుల సమాచారం

నియోజకవర్గం	నమోదైన అర్జీలు	పరిష్కరించిన అర్జీలు	పెండింగ్ అర్జీలు
పలమనేరు	4,245	664	3,581
చిత్తూరు	3,783	139	3,644
కుప్పం	1,434	453	981
నగరి	1,117	133	984
మొత్తం	10,579	1,389	9,190

అంతా ప్రచార ఆర్భాటమే

రెవెన్యూ సదస్సుల నిర్వహణ మొత్తం ప్రచార ఆర్భాటమేనని ప్రజలు విమర్శిస్తున్నారు. రెవెన్యూ సదస్సులు పూర్తి అయినా సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదు. తూతూ మంత్రంగా సమస్యలు పరిష్కరించి చేతులు దులుపుకుంటున్నారు. జిల్లాలోని చిత్తూరు, కుప్పం, నగరి, పూతలపట్టు, గంగాధరనెల్లూరు, పుంగనూరు, పలమనేరు నియోజకవర్గాల్లోని ప్రజలు సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు.

అర్జీ తిరస్కారం

గంగాధరనెల్లూరు మండలం వరత్తూరులో జరిగిన రెవెన్యూ సదస్సులో టీడీపీ నేత కోదండరెడ్డి ఆలయ ధర్మకర్త ముసుగులో గంగమ్మ ఆలయ భూమిని ఆక్రమించుకున్నాడని ఆ గ్రామస్తులు అర్జీ ఇచ్చేందుకు వెళ్లారు. అయితే ఆ అర్జీని గంగాధరనెల్లూరు తహసీల్దార్ తీసుకునేందుకు నిరాకరించారు. కలెక్టరేట్‌లో ఇదే అర్జీ ని ఇచ్చారని...తిరిగి ఇప్పుడు తీసుకోవడం కుదరదని గ్రామస్తులకు సమాధానం ఇచ్చారు. కాగా కలెక్టరేట్‌లో ఇచ్చిన అర్జీని అప్పుడే తహసీల్దార్‌కు పంపారు. తహసీల్దార్ అలసత్వంతోనే రెవెన్యూ సదస్సులో అర్జీని తిరస్కరించారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



అర్జీ తీసుకునేందుకు అనాసక్తి చూపుతున్న తహసీల్దార్ (ఫైల్)

భూ సమస్య తీరలేదు



మాది నింద్ర మండలం చవరంబాకం గ్రామం. మాకు మా గ్రామ లెక్క దాఖలాలో వ్యవసాయ భూములున్నాయి. మా భూములున్న సర్వే నంబర్లు 1బీలో కేటాయించిన సర్వే నంబర్లకు కొంత వ్యత్యాసం ఉంది. ఈ సమస్యతో పక్క భూములున్న వారితో తగాదాలు వచ్చాయి. సర్వే నంబర్లు సవరించి భూములకు హద్దులు చూపించాలని రెవెన్యూ సదస్సులో అర్జీ ఇచ్చాం. నెలలు గడుస్తున్నా ఏ మాత్రం పట్టించుకోలేదు. మాకు న్యాయం చేయడం లేదు.

– మీనా, అర్జీదారు, నింద్ర మండలం

ఒరిగిందేమీ లేదు



కూటమి ప్రభుత్వం ఎంతో హడావుడిగా నిర్వహించిన రెవెన్యూ సదస్సులతో ప్రజలకు ఒరిగిందేమీ లేదు. సదస్సుల్లో అర్జీలు తీసుకున్నారు కానీ పరిష్కారంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారు. దీంతో లబ్ధిదారులు మళ్లీ మళ్లీ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది. కనీసం అక్కడి అధికారులు అర్జీ ఎప్పుడు పరిష్కరిస్తారో కూడా సమాధానం చెప్పడం లేదు. ఈ రెవెన్యూ సదస్సులు ప్రచార ఆర్భాటం కోసమే చేసినట్టుంది. – రవి, కుప్పం

కాళ్లరిగేలా తిరుగుతున్నా..



నా భూ సమస్య పరిష్కరించాలని రెవెన్యూ సదస్సుతోపాటు కలెక్టరేట్, స్థానిక రెవెన్యూ కార్యాలయంలో అర్జీ ఇచ్చాను. అయినా నాకు న్యాయం జరగడం లేదు. నేను ఓ రైతు వద్ద 25 ఏళ్ల క్రితం ఎకరా భూమిని కొన్నాను. అప్పటినుంచి ఇప్పటివరకు ఆ నంబర్ పాస్‌బుక్‌లో ఎక్కించడంలేదు. అమ్మిన రైతు కూడా మరణించాడు. నాతో పాటు అమ్మిన రైతు కొడుకు మేము అమ్మింది నిజమే.. ఆ సర్వే నంబర్ వారి పాస్‌బుక్‌లో ఎక్కించాలని అధికారులకు చెప్పాడు. అయినా ఫలితం లేదు.

– మణిరెడ్డి, అర్జీదారు, పాలసముద్రం మండలం

కాణిపాకం కిటకిట



కిటకిటలాడుతున్న భక్తులు

కాణిపాకం: వరసిద్ధి వినాయకస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. శనివారం కావడంతో భక్తులు స్వామి దర్శనార్థం ఉదయం నుంచే క్యూకట్టారు. దీంతో కాణిపాకం గ్రామంలో ఎటు చూసినా భక్తుల రద్దీ కనిపించింది. ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర, వీఐపీ దర్శన క్యూలన్నీ కిక్కిరిశాయి. దర్శనానికి 2 గంటల సమయం పట్టింది. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆలయ అధికారులు చర్యలు చేపట్టారు. క్యూలో ఉన్న భక్తులకు పాలు, బిస్కెట్లు అందజేశారు.

22న ఐటీఐలో ఉద్యోగమేళా

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈ నెల 22వ తేదీన ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ రవీంద్రారెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఐటీఐ, అప్రెంటీస్ పూర్తి చేసిన అభ్యర్థులు ఉద్యోగ మేళాలో పాల్గొనవచ్చన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.21 వేలు జీతం ఇస్తారన్నారు. ఎంపికైన వారికి ఉచిత బస్సు, భోజనం, వసతి సౌకర్యం ఉంటుందన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు విద్యార్హత సర్టిఫికెట్లతో ఈ నెల 22వ తేదీ ఉదయం 10 గంటలకు నిర్వహించే ఉద్యోగ మేళాకు హాజరుకావాలన్నారు. ఇతర వివరాలకు 90306 57957, 77996 79351 నంబర్లలో సంప్రదించాలని ప్రిన్సిపల్ కోరారు.

ఆరోగ్యమే మహాభాగ్యం



వైద్య శిబిరంలో పాల్గొన్న డీటీసీ, లారీ అసోసియేషన్ సభ్యులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ఆరోగ్యమే మహాభాగ్యమని, వాహన చోదకులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే ప్రమాదాలు జరగవని డీటీసీ నిరంజన్‌రెడ్డి అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకుని చిత్తూరు నగరం మురకంబట్టు ప్రాంతంలోని లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో శనివారం కంటివైద్య శిబిరం, హెల్త్ చెకప్ నిర్వహించారు. అగర్వాల్ ఐ ఆస్పత్రి వైద్యులు కంటివైద్య శిబిరం, లైఫ్‌లైన్ ఆస్పత్రి సహకారంతో హెల్త్ చెకప్‌ను చేపట్టారు. ఈ శిబిరంలో 350 మంది డ్రైవర్లు పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి మందులు, మాత్రలు ఉచితంగా పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా లారీ డ్రైవర్లు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. నిద్రమత్తు, మద్యం మత్తులో వాహనం నడపకూడదన్నారు. సుదూర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు తగిన విశ్రాంతి అవసరమన్నారు. ఏకాగ్రతతో వాహనం నడపాలన్నారు. ప్రమాదాల్లో లారీ, ద్విచక్రవాహనాలే అధికంగా ఉన్నాయన్నారు. జాగ్రత్తగా వాహనం నడిపి రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఓ సునీల్‌కుమార్, ఎంవీఐలు మురళి, నరసింహులు, దీపిక, లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు చెంగల్‌రాయ నాయుడు, సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.



పెళ్లెప్పుడవుతుంది బాబూ!

- పలమనేరుకు చెందిన ఓ యువకుడు బెంగళూరులో సాఫ్ట్‌వేర్‌గా పనిచేస్తున్నాడు. స్థానికంగా భూములున్నాయి. బెంగళూరులో అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్ కొన్నాడు. వయస్సు 35 అవుతుంది. కానీ అమ్మాయి దొరకలేదు. దీంతో ఉన్న ఒక్కగానొక్క బిడ్డకు పెళ్లి ఎప్పుడవుతుందోనన్న బాధ ఆ తల్లిదండ్రులు పట్టి పీడిస్తోంది.
- పలమనేరు రూరల్ మండలానికి చెందిన ఓ వ్యక్తి 25 ఏళ్లుగా పెళ్లి కోసం చేయని ప్రయత్నం లేదు. ఏడెకరాల పొలం, ఒక్కడే కొడుకు కానీ అతనికి బిడ్డనిచ్చేందుకు ఎవరూ ముందుకు రాలేదు.

కొడుకంటే మమకారం.. వంశోద్ధారకుడు కావాలన్న ఆశయం.. ఫలితం సమాజంలో తగ్గుతున్న అమ్మాయిల జననం.. దీనికితోడు గొంతెమ్మ కోర్కెలు.. సాఫ్ట్‌వేర్లు.. మన కనుసైగల్లో మసలుకునే వారు కావాలన్న ఆశలు.. కూతురు, అల్లుడు ఒంటరిగా ఉండాలన్న వధువు తల్లిదండ్రుల షరతులు.. వెరసి పలువురు యువకులు పెళ్లికానీ ప్రసాద్‌లుగా మారుతున్నారు.

మూడు పదులు దాటిన పెళ్లి కాలే!

గతంలో అబ్బాయికి 21, అమ్మాయికి 18 వచ్చిందంటే పెళ్లిళ్లు జరిగేవి. ఇప్పుడు 30 ఏళ్లు దాటిన అమ్మాయిలు, 35 దాటిన అబ్బాయిల సంఖ్య పెరుగుతోంది. గతంలో పెళ్లిళ్లకు కుటుంబసమేతంగా హాజరయ్యేవారు. పెళ్లిళ్లలో నే అమ్మాయిని చూసి, పెళ్లి విషయాలు మాట్లాడుకుని వివాహాలు జరిపించేవారు. కానీ నేడు పెళ్లిళ్లకు ఇంటికొకరు మాత్రమే హడావుడిగా రిసెప్షన్‌కు వచ్చి వెళ్లిపోతున్నారు. దీంతో ఆ పెళ్లికి వచ్చిన వారిలో బంధువుల ఉన్నప్పటికీ మాట మంచీ లేకుండా పోతోంది.

ముదిరిపోతున్న పెళ్లికాని ప్రసాద్‌లు!

- ఏళ్లపాటు సంబంధాలు చూస్తున్నా.. జరగని పెళ్లిళ్లు
- సంబంధాల వేటలో పెరుగుతున్న అబ్బాయిల వయసు
- ఉద్యోగం, సంపాదన ఉన్నా అమ్మాయి దొరకలే!
- కొడుక్కి పెళ్లెప్పుడవుతుందోనని తల్లిదండ్రుల ఆవేదన

పలమనేరు: అబ్బాయికి ఆస్తి పాస్తులు.. మంచి ఉద్యోగం.. అందం అన్నీ ఉన్నాయి. వివాహం చేయడానికి వందలాది సంబంధాలు చూస్తున్నారు..అయినా అమ్మాయిలు దొరకడం లేదు. దీంతో 30 ఏళ్లు దాటిపోతోందని, అబ్బాయి పెళ్లి జరుగుతుందోలేదోనని అతడి తల్లిదండ్రులు ఎవరికీ చెప్పుకోలేక మధనపడుతున్నారు. గతంలో అమ్మాయి తర ఫువారే వరసైన వారికి పెళ్లి చేయించేలా పెద్దలు మాటిచ్చేవారు. ఇక బావా, మరదళ్లు అయితే చెప్పాల్సిన అవసరం ఉండేదికాదు. కట్నకానుకలపై పెద్దగా పట్టింపులుండేవి కాదు. కానీ రెండు దశాబ్దాలుగా వ్యవస్థ మారిపోయింది. ప్రస్తుతం పెళ్లి సంబంధాలు కుదరడం ఆషామాషీ కాదు. అబ్బాయికి పెళ్లి చేయాలంటే ఏం ఉద్యోగం, ఎంత జీతం, ఆస్తిపాస్తులు, సెల్ఫ్ అకౌంట్‌లో సేవింగ్స్ ఎంత, సొంతంగా సైట్ లేదా సొంత ఇల్లు, కారుందా? అనే మాట వినిపిస్తోంది. వివాహానంతరం వారిద్దరే వేరుగా ఉండాలనే మాట అమ్మాయి, వారి తల్లిదండ్రుల్లో వినిపిస్తోంది. దీంతోపాటు జాతకాలు, అబ్బాయిల వ్యక్తిగత విషయాలపై వేగుల విచారణ ఎక్కువైంది. వీరు అబ్బాయి ఫేస్‌బుక్, ఇన్‌స్టా, ఎక్స్‌తోపాటు జీ మెయిల్‌లో సెర్చింగ్ ఆధారంగా గర్ల్ ఫ్రెండ్స్, వారి అలవాట్లను కనుక్కుని పెళ్లి చేసుకోవాలా? వద్దా అని నిర్ణయించుకుంటున్నారు. దీంతో అబ్బాయిలకు అన్నీ ఉండీ మూడు పదులు దాటినా అమ్మాయిలు దొరక్క వారు పడుతున్న కష్టం కంటే వారి తల్లిదండ్రులు పడుతున్న మనోవేదన వర్ణనాతీతంగా మారింది.

5 వేల మంది పెళ్లిళ్ల పేరయ్యలు

మ్యాట్రిమోనియల్ సైట్లు, ఆయా కులాలకు చెందిన ప్రత్యేక సైట్లుతోపాటు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 5వేల మందికిపైగా పెళ్లిళ్ల పేరయ్యలున్నారు. వీరందరూ తమ వద్ద వేలాది మంది అబ్బాయిలు, అమ్మాయిల ప్రొఫైళ్లు పెట్టుకుని ఇరువర్గాలకు చూపుతున్నా పెళ్లిళ్లు మాత్రం సెట్ కావడం లేదు.

కర్షకుడా..? అయితే వద్దులే!

సేద్యం చేసుకునే వారికి ఆడబిడ్డ దొరకడం చాలా కష్టంగా మారింది. మరికొన్ని వృత్తి పనులు చేసేవారికి సైతం ఈ సమస్య తప్పడం లేదు. కొన్ని ఉన్నత కులాల్లోనూ అమ్మాయిల దొరకడం కష్టంగా మారింది. ఇంకొందరికి జాతకాలు సెట్‌కాలేదనే కారణం కనిపిస్తోంది. గతంలో అమ్మాయి లు, అబ్బాయిల సగటు సమానంగా ఉండేది. కానీ ఇప్పుడు లింగవివక్ష కారణంగా అబ్బాయిల కంటే అమ్మాయిల సగటు తగ్గుతోంది.

నిఘా వర్గాలతో కొన్ని సంబంధాలు విఫలం

తమ పిల్లను పలానా వాళ్లు అడిగారు, వారి అబ్బాయి మంచోడేనా కనుక్కోవాలని పెళ్లి కుమార్తె తరఫువారు తెలిసిన వారిని ఆరా తీస్తున్నారు. దీంతో వారు ఓకే అంటే పర్వాలేదు గానీ.. అబ్బాయికి ఏదో అలవాట్లున్నాయని, లేదా చెప్పిన జీతం అంత లేదని, అసలు సాఫ్ట్‌వేర్ కాదని, ఏదో విషయంలో తప్పులు చెప్పారని సమాచారం ఇస్తే ఇక పెళ్లి కథ కంచికి చేరుతోంది.

పెళ్లిళ్లు సెట్ చేయడం చాలా కష్టం



గతంలో ఎన్నో పెళ్లిళ్లు సెట్ చేశాం. ఇప్పుడు తల్లిదండ్రులు కాదు పెళ్లి చేసుకునే అమ్మాయిలు ఎన్నో షరతు లు పెడుతున్నారు. గతంలో అబ్బాయి, అమ్మాయి ఫొటోలు చూసి పెళ్లికి ఒప్పుకొనేవారు. ఇప్పుడలా కాదు ఇరువర్గాలు మొత్తం విచారించుకుని, నచ్చితేనే ఓకే అంటున్నారు. నేడు పెళ్లి కుమార్తె డిమాండ్లను తీర్చడం ఆషామాషీ కాదు.

–త్యాగరాజులు, ఎస్ఎల్‌వీ మ్యారేజీ లింక్స్ నిర్వాహకులు, పలమనేరు

అమ్మాయిల సంఖ్య తక్కువ



అబ్బాయిలు ఎక్కువగా ఉన్నారు. వారికి కావాల్సిన మేరకు అ మ్మాయిలు దొరకడం లేదు. ఇంతకుముందు తల్లిదండ్రులు ఒ ప్పుకుంటే పెళ్లి తక్కున జరిగేవి. ఇప్పుడలాకాదు అమ్మాయి గ్రీన్ సిగ్నల్ ఇవ్వాలంటే ఎన్నో డిమాండ్లు పెడుతోంది. అంతా సాఫ్ట్‌వేర్లే కావాలంటున్నారు. సేద్యం చేసుకునే వాడి ని పెళ్లి చేసుకొనేవాళ్లెవరో అర్థం కాలేదు. గొంతెమ్మ కొర్కెలతో ముదిరిపోతున్నారు.

– లక్ష్మీపతినాయుడు, మ్యారేజీ బ్రోకర్, బురిశెట్టిపల్లి, బైరెడ్డిపల్లి మండలం

క్లుప్తంగా

25న జోనల్ సమావేశం

చిత్తూరు కలెక్టరేట్ : జీఓ 117 రద్దు, ఉపాధ్యాయుల సర్దుబాటు, మోడల్ ప్రైమరీ స్కూళ్ల ఏర్పాట్లపై చర్చించేందుకు ఈ నెల 25వ తేదీన జోనల్ స్థాయి సమావేశాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు శనివారం డీఈఓ కార్యాలయానికి రాష్ట్ర విద్యాశాఖ జారీ చేసిన ఉత్తర్వులు అందాయి. ఆ ఉత్తర్వుల మేరకు ఈ నెల 25వ తేదీన తిరుపతి జిల్లా కేంద్రంలో తిరుపతి, చిత్తూరు జిల్లాల కలెక్టర్ల ఆధ్వర్యంలో జోనల్ సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

91 గ్రామాల్లో రీ సర్వే

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని 91 గ్రామాల్లో రీ సర్వే నిర్వహించేందుకు కలెక్టరేట్ అధికారులు చర్యలు చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా రీసర్వే పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. జిల్లాలో గుర్తించిన 91 గ్రామాల్లో 30,790,15 వేల ఎకరాల్లో రీ సర్వే నిర్వహించనున్నట్లు కలెక్టరేట్ అధికారులు వెల్లడించారు.

కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య


రోజా మృతదేహం

గుడుపల్లె: కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన గుడుపల్లె మండలం, గుండ్లసాగరంలో శనివారం చోటు చేసుకుంది. గుడుపల్లె పోలీసుల కథనం మేరకు.. గుండ్లసాగరం గ్రామానికి చెందిన చెందిన సురేష్‌బాబుకు సోడిగానిపల్లి పంచాయతీ కొత్తూరు గ్రామానికి చెందిన రోజా (23)తో నాలుగేళ్ల కిందట పెద్దల సమక్షంలో వివాహం జరిగింది. నాలుగేళ్లు అయినా వీరికి సంతానం లేకపోవడంతో తరచూ ఇంట్లో గొడవలు జరుగుతున్నాయి. దీంతో మనస్తాపానికి గురైన రోజా శనివారం ఇంట్లో పైకప్పునకు ఉరి వేసుకుంది. ఈ ఘటనపై రోజా బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


మాతా శిశు సంరక్షణకు కృషి చేయండి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): వైద్యసిబ్బంది చిత్తశుద్ధితో విధులు నిర్వహిస్తూ మాతా శిశు సంరక్షణ కృషి చేయాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ సుధారాణి అన్నారు. చిత్తూరు నగరంలోని తన కార్యాలయంలో శనివారం ఆశా నోడల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి, మాట్లాడారు. గర్భిణులను సకాలంలో గుర్తించి, వైద్య సేవలు అందించాలన్నారు. హైరిస్క్ కేసులపై దృష్టి సారించాలని చెప్పారు. క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను విధిగా చేపట్టాలని పేర్కొన్నారు.

మోటారు సైకిళ్ల దొంగ అరెస్టు

చిత్తూరు అర్బన్: నగరంలో మోటారు సైకిళ్లను చోరీ చేస్తున్న వ్యక్తిని పోలీసులు శనివారం అరెస్టు చేశారు. వన్‌టౌన్ సీఐ జయరామయ్య కథనం మేరకు.. చిత్తూరు నగరంలోని చర్చివీధి, మిట్టూరు, కట్టమంచి తదితర ప్రాంతాల్లో ఇటీవల కాలంలో మోటారు సైకిళ్లు చోరీకి గురవుతున్నట్లు పోలీసులకు ఫిర్యాదులు అందాయి. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. చిత్తూరు ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతంలో పోలీసులు తనిఖీలు చేస్తుండగా.. ఓ యువకుడు పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించాడు. అతడిని పట్టుకుని విచారించగా, చెన్నైకు చెందిన ఎం.దినేష్ (19)గా చెప్పాడు. చిత్తూరులో తనతో పాటు పలువురు మోటారు సైకిళ్లను చోరీ చేసి, విక్రయించగా వచ్చే డబ్బుతో జల్సాలకు అలవాటు పడినట్టు పోలీసులకు వాంగ్మూలం ఇచ్చాడు. దీంతో నిందితుడిని అరెస్టు చేసి, ఇతను దాచి ఉంచిన ఆరు మోటారు సైకిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ఆయన నేపథ్యం సామాన్య, మధ్యతరగతి కుటుంబం.. ప్రభుత్వ పాఠశాల, కళాశాలలోనే విద్యాభ్యాసం.. ఆపై చదివిన చోటే తొలుత కొలువు.. ఐదేళ్ల అనంతరం పొరుగు రాష్ట్రమైన కర్ణాటకలో అధ్యాపక ఉద్యోగం.. పాఠశాలపై పరిశోధనం.. సులభశైలిలో బోధనమే ఆయన లక్ష్యం.. అందుకే ఆయన కలం పట్టాడు.. పలు పాఠ్యాంశాలు రచించాడు.. ఆ పాఠాలు నేడు ఆంధ్రప్రదేశ్‌కు పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, తెలంగాణ యూనివర్సిటీల సిలబస్‌లో చోటు చేసుకున్నాయి. ఆయనెవరో కాదు మన పుంగనూరు వాసి రాజపురోహితం శ్రీనివాసరావు.


రచించిన పుస్తకాలతో శ్రీనివాసరావు

రాజపురోహితం రచించిన పుస్తకాలివీ..

శ్రీనివాసరావు 2010లో ఇంటర్మీడియట్‌కు సంబంధించి కంప్యూటర్ సైన్స్‌ను ప్రచురించారు. ప్రస్తుతం 2024లో ఎస్‌ఈపీ సిలబస్‌లో ప్రాబ్లమ్ సాల్వింగ్ టెక్నిక్స్, కంప్యూటర్ ఆర్కిటెక్స్ పుస్తకాలు విడుదల చేశారు. తాను రచించిన పుస్తకాలు డిజిటల్ ఫ్లూయన్సీ, ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్(ఏఐ), పైథాన్ ప్రోగ్రామింగ్, ఇంటర్నెట్ టెక్నాలజీ, వెబ్ ప్రోగ్రామింగ్, ఎలక్ట్రానిక్ కంటెంట్ డిజైన్, సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్, విజువల్ ప్రోగ్రామింగ్, సైబర్ సెక్యూరిటీ, క్రిప్టోగ్రఫీ అండ్ నెట్‌వర్క్ సెక్యూరిటీ, కంప్యూటర్ అప్లికేషన్స్ ఇన్ బిజినెస్, ఎంటర్‌ప్రైజ్ రీసోర్స్ ప్లానింగ్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, మ్యాథమెటిక్స్ ఫర్ బీకాం వీటితో పాటు మారుతున్న సాంకేతిక విధానాలను ఎప్పటికప్పుడు తన నైపుణ్యంతో విద్యార్థులకు సరళమైన విధానంలో బోధనాంశాలను మార్పిడి చేసి, అందిస్తున్నారు.

పొరుగు పేజీలో శ్రీనివాసం

- అధ్యాపకుడు శ్రీనివాసరావు ఘనత
- తెలంగాణ, కర్నాటక రాష్ట్రాల సిలబస్‌లో పుంగనూరు వాసి రచనలు
- మార్కెట్‌లోకి 30 పుస్తకాలు

పుంగనూరు: పట్టణంలోని బ్రాహ్మణవీధికి చెందిన రాజపురోహితం ప్రభాకర్, కమలమ్మ దంపతుల మూడో కుమారుడు రాజపురోహితం శ్రీనివాసరావు 1976లో జన్మించారు. ఈయన పుంగనూరులోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో డిగ్రీ వరకు చదివారు. ఎమ్మెసీ కంప్యూటర్ సైన్స్, ఎమ్మెసీ మ్యాథ్‌మ్యాటిక్స్ నెల్లూరులో చదివారు.

అధ్యాపకుడిగా..

ఆర్.శ్రీనివాసరావు చదువు పూర్తి కాగానే తొలుత స్థానిక బసవరాజ కళాశాలలో 1999 సంవత్సరం నుంచి ఐదేళ్లపాటు అధ్యాపకుడిగా పని చేశారు. 2006లో బెంగళూరులో అధ్యాపకుడిగా చేరి అక్కడ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. అక్కడి నుంచి ఆయన దృష్టి విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు, సులభశైలిలో రాయడంపై పడింది. దీంతో ఆయన పాఠ్యపుస్తకాలు రచించడం ప్రారంభించారు. అలాగే విద్యార్థులకు నైపుణ్యాలను సులభశైలిలో వివరించేలా వివిధ రకాల కంప్యూటర్ అప్లికేషన్లు తయారు చేసి, అందించి, ప్రతిభను చాటుకున్నారు.

సిలబస్‌ను అమలు చేస్తున్న యూవర్సిటీలివీ..

కర్ణాటకలోని బెంగళూరు యూనివర్సిటీ, టుముకూరు యూనివర్సిటీ, బెంగళూరు సిటీ యూనివర్సిటీతో పాటు తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఉస్మానియా యూనివర్సిటీ కూడ శ్రీనివాసరావు పుస్తకాలను సిలబస్‌గా వినియోగిస్తున్నాయి. ఈయనకు కర్ణాటక పరీక్షల నిర్వాహణాధికారులు పీహెచ్‌డీ తదితర పరీక్షలకు వెళ్లేందుకు సర్టిఫికెట్ జారీ చేశారు.

అవార్డులు, ప్రశంసలు

రాజపురోహితం శ్రీనివాసరావు తయారు చేసిన కరెంటు ట్రెండ్స్ అండ్ ఫ్యూచర్ ఇన్ టెక్నాలజీస్ వ్యాసాలకు, అలాగే సీసీఎస్‌ఏ సర్టిఫికేషన్ ఈడుస్కిల్స్‌కు ప్రశంసలు లభించింది. అలాగే ముంబైకి చెందిన వెస్ట్ రోటరీ వారు 2019 లో బెస్ట్ టీచర్ అవార్డును అందజేశారు. అలాగే ఐఎన్‌ఎస్‌సీ బెంగళూరు వారు 2020లో బెస్ట్ టీచర్ అవార్డును ఇచ్చి సత్కరించారు.



శ్రీనివాసరావు అందుకున్న అవార్డు, సర్టిఫికెట్

ఈయన పుస్తకాలు ముద్రించిన సంస్థలు

శ్రీనివాసరావు రచించిన 30 పుస్తకాలను హిమాలయ పబ్లికేషన్స్ ముంబై వారు 2010లో ముద్రించి మార్కెట్‌లో విడుదల చేశారు. అలాగే విజన్ పబ్లికేషన్స్ వారు ముద్రించి రచయితకు రాయల్టీ చెల్లించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ తన పుస్తకాలను ముద్రించిన సంస్థలు, సిలబస్‌గా వినియోగిస్తున్న కర్ణాటక, తెలంగాణ ప్రభుత్వాలకు కృతజ్ఞతలు తెలిపారు.

బలహీన వర్గాల ఆశాజ్యోతి జగన్

- మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి


మాజీ ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి

కార్వేటినగరం: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి అని మాజీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ ప్రతి పేద విద్యార్థి ఆంగ్ల మాద్యమంలో ఉన్నత విద్యను అభ్యసించాలన్న ఉన్నతాశయంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. పలు పథకాలను అమలు చేసి, పేద విద్యార్థులకు ఉన్నత విద్యను చేరువ చేశారన్నారు. ప్రభుత్వ పాఠశాలలు రూపురేఖలను మార్చి, కార్పొరేట్ దీటుగా విద్యాబోధన అందించిన ఘనత కూడా జగనన్నకే దక్కిందన్నారు. దేశ చరిత్రలోనే ఐక్యరాజ్యసమితికి ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను పంపిన ఘనత జగనన్నదేనన్నారు. రాష్ట్ర ప్రజల ఆశీర్వాదంతో నేడు జగనన్న కుమార్తె వర్షారెడ్డి ప్రపంచంలోనే ప్రఖ్యాతి గాంచిన లండన్ కింగ్స్ కాలేజీలో మాస్టర్ ఆఫ్ సైన్స్ పట్టా పొందడం, అందులోనూ ప్రథమ స్థానం సాధించడం దేశం గర్వించదగ్గ విషయమన్నారు. నేడు కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి విద్యావ్యవస్థను అస్తవ్యస్తం చేసి, పేద విద్యార్థులకు ఉన్నత విద్యను దూరం చేస్తోందని విమర్శించారు.

కొనసాగుతున్న దేహదారుఢ్య పరీక్షలు


పరుగుల పోటీలో పాల్గొన్న అభ్యర్థులు


క్షతగాత్రురాలిని పరామర్శిస్తున్న పోలీసు అధికారులు

చిత్తూరు అర్బన్: కానిస్టేబుల్ ఎంపిక ప్రక్రియలో భాగంగా చిత్తూరు నగరంలోని జిల్లా పోలీసు శిక్షణ మైదానంలో శనివారం కూడా అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు కొనసాగాయి. ఇన్‌చార్జ్ ఎస్పీ రత్న పర్యవేక్షణలో ఈ పరీక్షలు పకడ్బందీగా జరిగాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న ఈ పరీక్షలకు 750 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఇందులో రాత పరీక్షకు 270 మంది అర్హత సాధించినట్లు పోలీసు అధికారులు తెలిపారు. భర్తీ ప్రక్రియ పారదర్శకంగా జరుగుతోందని, దళారులన నమ్మొదని పేర్కొన్నారు.

దేహదారుఢ్య పరీక్షల్లో గాయపడిన మహిళ

కానిస్టేబుల్ పోస్టు భర్తీలో భాగంగా జరుగుతున్న దేహదారుఢ్య పరీక్షల్లో ఓ మహిళకు కాలు విరిగి, గాయపడి ఆస్పత్రి పాలైంది. వివరాల్లోకి వెళితే.. చిత్తూరు నగరంలోని పోలీసు శిక్షణ క్రీడా మైదానంలో కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షలు జరుగుతున్నాయి. శనివారం జరిగిన ఈ పరీక్షలకు మదనపల్లె సమీపంలోని వాయల్పాడుకు చెందిన షకీలా అనే అభ్యర్థి హాజరైంది. 1600 మీటర్ల పరుగు పందెంలో ఈ మహిళ అదుపు తప్పి కింద పడిపోయింది. దీంతో ఆమెకు కాలు విరిగి, గాయపడింది. భరించలేని నొప్పితో కేకలు పెట్టింది. దీంతో సత్యసాయి జిల్లా ఎస్పీ రత్న సిబ్బంది సాయంతో ఆమెను చిత్తూరు జిల్లా ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేశారు. అనంతరం బోర్డు చైర్మన్ రవి ప్రకాష్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయనతో పాటు ఎస్పీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళను పరామర్శించారు. వైద్యుల సూచన మేరకు గాయపడిన మహిళను మెరుగైన వైద్యం కోసం మదనపల్లి ఆస్పత్రికి తరలించే ఏర్పాట్లు చేశారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

పచ్చదనం పెంచండి

చిత్తూరు కలెక్టరేట్ : ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా పచ్చదనం పెంచాలని సమగ్రశిక్ష శాఖ అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ వెంకటరమణ అన్నారు. డీఈఓ కార్యాలయంలో స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి ప్రభుత్వ పాఠశాలలో మొక్కలను విరివిగా పెంచాలన్నారు. పాఠశాలల పరిసరాలను పరిశుభ్రంగా పెట్టుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సమగ్రశిక్ష సెక్టోరల్ అధికారులు ఉదయలక్ష్మి, జయప్రకాష్, డీఈఓ కార్యాలయ సిబ్బంది మురళి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపదపై ప్రత్యేక దృష్టి పెట్టాలి


చెత్త సేకరణ కేంద్రంలో వర్మికంపోస్టును పరిశీలిస్తున్న డీపీఓ సుధాకర్ రావు

పాలసముద్రం: చెత్త నుంచి సంపద తయారుపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, పంచాయతీ ఆదాయం పెంచుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) సుధాకర్‌రావు తెలిపారు. శనివారం శ్రీకావేరిరాజుపురం సచివాలయం, చెత్త సేకరణ కేంద్రాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ చెత్త సేకరణ, వర్మికంపోస్టు తయారీతో గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్య పరిష్కారం కావడంతోపాటు పంచాయతీకి ఆదాయం వస్తుందన్నారు. గ్రీన్ అంబాసిడర్ల ద్వారా ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను సేకరించి, కంపోస్టు యార్డులకు తరలించి, వర్మికంపోస్టు తయారు చేసి, విక్రయించాలన్నా రు. ఈ కార్యక్రమంలో శ్రీకావేరిరాజపురం సర్పంచ్ గాలి మహేష్ బాబు, మండల విస్తరణాధికారి రమేష్, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, గ్రీన్ అంబాసిడర్లు తదితరులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణలపై ఆందోళన

పుత్తూరు: తమ సాగు భూముల ఆక్రమణను నిరసిస్తూ శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద యానాదులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా దళిత గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నందయ్య మాట్లాడుతూ పుత్తూరు మండలం గోపాలకృష్ణాపురం గ్రామానికి చెందిన యానాదులు తొరూరు రెవెన్యూ లెక్క దాఖలాలోని సర్వే నంబర్ 348, 355లో మామిడి చెట్లు సాగు చేసుకుని, జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ఇందుకు సంబంధించిన పట్టాదారు పాసుపుస్తకాలు సైతం ఉన్నాయన్నారు. అయితే నేసనూరు గ్రామానికి చెందిన మనోహర్‌రెడ్డి అనే వ్యక్తి శనివారం సదరు భూములు తన పేరిట ఉన్నాయంటూ యానాదులను బెదిరించి, దుర్భాషలాడారని ఆరోపించారు. ఇలా పేదల భూములను ఆక్రమించాలని చూస్తూ దౌర్జన్యాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు యానాదులు తమకు న్యాయం చేయాలని కోరుతూ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. దీనిపై తహసీల్దార్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ యానాదులకు న్యాయం జరుగుతుందని, ఆక్రమణలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామస్తులు రామచంద్రయ్య, కుమార్, రామయ్య, నాగమ్మ, సురేష్, బాబు తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరులో భారీ చోరీ

- చిత్తూరులో రూ.లక్షల్లో నగదు బంగారు చోరీ

చిత్తూరు అర్బన్: నగరంలో ఓ భారీ చోరీ జరిగింది. దొడ్డిపల్లెకు చెందిన సెల్వరాజ్ అనే రిటైర్డు ఉద్యోగి ఇంట్లో దొంగలు పడ్డారు. రూ.లక్షల్లో నగదు, భారీగా బంగారు ఆభరణాలు చోరీ జరిగినట్లు బాధితుడు వాపోతున్నాడు. విద్యుత్‌శాఖలో పనిచేసిన సెల్వరాజ్ 2022లో ఉద్యోగవిరమణ పొందారు. ఆయన భార్యతో కలిసి నగరంలోని దొడ్డిపల్లెలో ఉంటున్నారు. ఉద్యోగ విరమణ చేసిన సమయంలో వచ్చిన నగదును తన ముగ్గురు కుమార్తెలకు వాటాలు పంచిపెట్టారు. అయితే ముగ్గురు కూతుళ్లు నగదు మొత్తం తన వద్దే ఇచ్చి పెట్టారు. శుక్రవారం తన భార్యకు అనారోగ్యంగా ఉండడంతో వేలూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లారు. శనివారం ఉదయం ఇంటికి వచ్చేసరికి గేటు ధ్వంసం చేసి, ఇంట్లోకి ప్రవేశించిన గుర్తుతెలియని వ్యక్తులు బీరువాను సైతం పగులగొట్టి ఉన్నారు. ఇంట్లో ఉన్న దాదాపు రూ.30 లక్షలకు పైగా నగదు, 400 గ్రాముల వరకు బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు బాధితుడు చెబుతున్నాడు. ఇంత భారీ మొత్తంలో నగదు, నగలు ఎందుకు ఇంట్లో పెట్టుకున్నారని పోలీసులు ప్రశ్నిస్తున్నారు. జరిగిన ఘటనపై కేసు నమోదు చేసిన వన్‌టౌన్ పోలీసులు, దర్యాప్తు ప్రారంభించారు.


ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు